

రైతుల కోసం.. రైతుల పేరిట ఏర్పాటు చేసిన సహకార సంఘాలు అక్రమాలకు నెలవుగా మారాయి. సాంకేతిక పరిజ్ఞానంతో ఇక నుంచి అక్రమాలకు ఆస్కారం లేకుండా.. రుణాల విషయంలో పారదర్శక పద్ధతి అవలంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల సహకార వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సహకార వ్యవస్థను పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తోన్నది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పీఏసీఎస్‌లలో జరిగిన అక్రమాలపై దృష్టి పెట్టి అవి పునరావృతం కాకుండా డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే సొసైటీల్లో దాదాపు 95 శాతం ఖాతాలను ఆన్‌లైన్‌చేశారు. సొసైటీలలో జరిగే అవకతవకలకు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అడ్డుకట్ట పడనుందని తద్వారా పీఏసీఎస్‌ల బలోపేతానికి కంప్యూటరీ కరణ ద్వారా ప్రభుత్వం తొలి అడుగు వేసినట్లయింది.

# సహకారం.. సాంకేతికం

- సొసైటీల్లో కొలిక్కివచ్చిన కంప్యూటరీకరణ
- ఏప్రిల్ నుంచి పీఏసీఎస్‌ల్లో డిజిటల్ లావాదేవీలు



- ఆన్‌లైన్‌తో డీసీసీబీ శాఖల్లో అవకతవకలకు అడ్డుకట్ట
- అన్నివిధాలుగా సొసైటీలను కునారిల్లేలా చేసిన గత ప్రభుత్వం
- సహకార వ్యవస్థను పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తోన్న కూటమి ప్రభుత్వం

### గతంలో అక్రమాలకు సహకారం

ఐదేళ్ల వైసీపీ హయాంలో పీఏసీ ఎస్‌లను అన్ని విధాలుగా కునారిల్లేలా చేసింది. ప్రతిఏటా సొసైటీల్లో ప్రవేశపెట్టే ఆడిట్ నివేదికలను కూడా తొక్కిపట్టి పెద్దఎత్తున అక్రమాలకు తెరతీసింది. అర్హత లేని ఎంతోమందికి రాజకీయ పరపతి ద్వారా సొసై టీల్లో ఉన్న సొమ్ములను దోచిపెట్టింది. త్రీమెన్ కమి టీల పేరిట ఐదేళ్ల పాటు ఓ ప్రహసనాన్ని నడిపింది. సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేసే ప్రక్రియలో కూడా ముడుపుల పర్వానికి తెరతీసి అర్హత కలిగిన ఎంతోమందికి వేదనను మిగిల్చింది.


### నేడు కూటమి బలోపేతం

డీసీసీబీ శాఖల్లోని ఖాతాలను ఆన్‌లైన్ చేయడంతో పాటు సొసైటీలు సొంతంగా నిలదొక్కుకునే విధంగా కూడా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఆయా సహకార సంఘాల ద్వారా ఇతర వ్యాపారాల కోసం ఆసక్తి ఉన్న వారికి డీసీసీబీ ద్వారా రుణాలు ఇప్పించి వాటిని బలోపేతం చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతుల కోసం ఖర్చు పెట్టాలనే ఆలోచనను ప్రభుత్వం చేసింది. మొత్తంగా చూస్తే పీఏసీఎస్‌లకు జవసత్వాలు కల్పించడం ద్వారా సహకార సొసైటీల వ్యవస్థ సుదీర్ఘ కాలం రైతులకి సేవలందిస్తూ ఉండాలని, అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సమాయత్తమవుతోంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాంకేతిక సహకారంతో సహకార వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇంతకాలం సహకార వ్యవస్థ అక్రమాలతో నిండిపోగా పాలకవర్గాలు, ఉద్యోగుల అవినీతితో రైతులకు అందాల్సిన రుణాలు పక్కదారి పట్టాయి. దీనికితోడు గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్ణయాలతో మొత్తం వ్యవస్థే గాడి తప్పింది. దీంతో కూటమి ప్రభుత్వం పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)ల్లోని ఖాతాలన్నింటినీ ఆన్‌లైన్ చేసేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. తద్వారా సంబంధిత లావాదేవీల్లో జరిగిన లొసుగులు బయటపడడంతో పాటు అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి వీలుంటుందనేది ప్రభుత్వ ఆలోచన. ఇది చేపట్టి ఇప్పటికే నాలుగు నెలలు గడుస్తుండగా ఖాతాల కంప్యూటరీకరణ కొలిక్కి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డీసీసీబీ పరిధిలో 167 పీఏసీఎస్‌లు ఉన్నాయి. బాపట్ల జిల్లాకు వచ్చేసరికి ఈ సంఖ్య 112గా ఉంది. ఇందులో గుంటూరులోని డీసీసీబీ పరిధిలో 44 పీఏసీఎస్‌లు ఉండగా, ఒంగోలులోని డీసీసీబీ కింద 68 సహకార సొసైటీలు ఉన్నాయి. వీటికి సంబంధించి దాదాపు 95 శాతం ఖాతాల ప్రక్రియ ఆన్‌లైన్ పూర్తయింది. ఉమ్మడి గుంటూరు పరిధిలోని పీఏసీఎస్‌లలో 90 శాతం ఖాతాల డిజిటలైజేషన్ కొలిక్కి రాగా ఈ నెల పదిహేను కల్లా వందశాతం ఖాతాల ఆన్‌లైన్ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసిన ప్రభుత్వం మొత్తం డిజిటలైజేషన్ దాని ద్వారానే చేపడుతోంది. ఏప్రిల్ నుంచి లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయని తద్వారా రోజువారీ ప్రగతి నివేదికలు తెలుసుకోవడానికి (మిగతా 10వ పేజీలో)





# పల్నాడు ప్రథమం

- లక్ష్యం కంటే అధికంగా సీసీఆర్ కార్డుల పంపిణీ
- కొద్దిగా వెనకబడిన గుంటూరు, బాపట్ల జిల్లాలు
- ఈ-క్రాప్, వ్యవసాయ రుణాలకు మార్గం సుగమం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల కష్టాలు తీరిపోతున్నాయి. ఈ-క్రాప్ బుకింగ్, వ్యవసాయ రుణాలు పొందేందుకు ఇంతకాలం అవస్థలు పడిన కౌలు రైతులకు మేలు చేసేలా క్రాప్ కల్టివేటర్ రైట్స్(సీసీఆర్) కార్డుల మంజూరుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే ఈ కార్డుల మంజూరులో పల్నాడు జిల్లా లక్ష్యాలను అధిగమించింది. కేటాయించిన లక్ష్యం కంటే అధికంగా పంపిణీ చేసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రథమస్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ లక్ష్యాన్ని 10 జిల్లాలు అధిగమించగా అందులో పల్నాడు జిల్లా ఒకటిగా నిలవడం విశేషం. మరోవైపు గుంటూరు, బాపట్ల జిల్లాలు కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు ఇవ్వడంలో కొంత వెనకబడ్డాయి. సాధ్యమైనంత త్వరగా లక్ష్యాన్ని అధిగమించాలని ప్రభుత్వం రెండు జిల్లాల అధికారులను ఆదేశించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పల్నాడు జిల్లాలో 65 వేల మంది కౌలురైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా 65,126 కార్డులు మంజూరు చేసి 100 శాతం లక్ష్యాన్ని అధికారులు అధిగమించారు. మరోవైపు గుంటూరు జిల్లాకు 46,670 సీసీఆర్ కార్డులు లక్ష్యం ఇవ్వగా 39,424 కార్డులు మంజూరు చేసి 84 శాతం పురోగతిని నమోదు చేయగలిగింది. బాపట్ల జిల్లాకు గుంటూరు, పల్నాడు కంటే అధిక లక్ష్యాన్ని ప్రభుత్వం ఇచ్చింది. ఈ జిల్లాలో 1,06,670 కార్డులు వ్యవసాయ సీజన్‌లో మంజూరు చేయాల్సిందిగా లక్ష్యం కేటాయించగా 88,219 కార్డులు మంజూరు చేసి 83 శాతం పురోగతిని సాధించింది. ప్రస్తుతం రబీ సీజన్ కూడా ముగింపు దశకు చేరుకున్నది. ఈ నేపథ్యంలో వచ్చే ఖరీఫ్ సీజన్‌కి అయినా ఎక్కువ సంఖ్యలో సీసీఆర్ కార్డులు మంజూరు చేయాల్సిన బాధ్యత ఆయా జిల్లా యంత్రాంగాలపై ఉన్నది. మరో రెండు నెలల్లో ఖరీఫ్ రుణాల పంపిణీ మొదలు అవుతుంది. ఈ దృష్ట్యా ఇప్పటి నుంచే వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది.

### త్వరలో కౌలు రైతుల కోసం చట్టం..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో చాలావరకు కౌలు రైతులే పంటలు సాగు చేస్తున్నారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వీరికి ఎలాంటి నష్టపరిహారం అందడం లేదు. మరోవైపు పంటలు సాగుకి బ్యాంకర్ల నుంచి రుణాలు కూడా పొందలేని పరిస్థితి. ఇందుకు కారణం భూమికి సంబంధించిన హక్కులన్నీ సంబంధిత యజమాని ఆధీనంలోనే ఉంటాయి. తాను పంట వేయకపోయినా బ్యాంకుల నుంచి రుణం తీసుకోగలుగుతాడు. అలానే ప్రకృతి విపత్తులు చోటు చేసుకున్నప్పుడు అధికారుల వద్ద ఉన్న డేటాలో యజమాని పేరే ఉంటుంది కాబట్టి ఆయనే నష్టపరిహారం పొందుతున్నాడు. కౌలురైతుల కోసం గత ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా అవి వారికి అక్కరకు రాలేదు. కూటమి ప్రభుత్వం కౌలురైతుల చట్టాన్ని సవరించి వారికి లబ్ధి చేకూర్చేందుకు ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నది. త్వరలోనే కొత్త చట్టం అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

# ఎల్లవేళలా దయాక్షేత్రంపై ఏసయ్య కరుణ

- పాస్టర్ జాషువా మోజెస్
- లేమల్లెలో 48వ గుడారాల పండగ ప్రారంభం
- లక్షలాదిగా వచ్చిన దైవజనులు, విశ్వాసులు

10 లో



దయాక్షేత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అమెరికాకు చెందిన పాస్టర్ ఎల్విస్ పాల్



అమరావతి మండలం లేమల్లె గ్రామంలో ప్రారంభమైన హోసన్న గుడారాల పండుగలో పాల్గొన్న విశ్వాసులు

- పన్నులపై తేలని నిర్ణయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- సమస్యలు పట్టించుకోని పంచాయతీలు, మున్సిపాలిటీ
- నరసరావుపేటలోని విలీన ప్రాంతాల్లో మూడేళ్లుగా ఇదే దుస్థితి

# విలీన.. వెతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మున్సిపాలిటీలో విలీనమైన కాకతీయనగర్‌లో ఓ వ్యక్తి కుమారుడి విదేశీ చదువుకు రుణం కోసం బ్యాంకుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయని బ్యాంకు అధికారులు నిర్ధారించి రుణం ఇచ్చేందుకు సముఖత వ్యక్తం చేశారు. అయితే ఇంటి పన్నుకు సంబంధించి తాజా రశీదు కావాలని కోరారు. దీంతో ఆయన పన్ను చెల్లించేందుకు రావిపాడు పంచాయతీకి వెళ్లగా మీ ఇల్లు మున్సిపాల్టీలో ఉంది అక్కడ చెల్లించాలన్నారు. మున్సిపాల్టీకి వెళ్లగా మీ ఇంటి పన్ను కంప్యూటరీకరణ కాలేదని సదరు అధికారి చెప్పారు. అటు మున్సిపాల్టీ, ఇటు పంచాయతీ అధికారులు పన్ను స్వీకరించక పోవడంతో ఆయనకు బ్యాంకు రుణం నిలిచిపోయే పరిస్థితి నెలకొంది..


- ఇది ఒక ఉదాహరణ మాత్రమే. నరసరావుపేట మున్సిపాలిటీలో విలీన ప్రాంతాల్లోని అనేక మంది పరిస్థితి ఇదే. ఇక ఆయా ప్రాంతాల్లోని సమస్యల గురించి అటు పంచాయతీలు పట్టించుకోవడంలేదు. ఇటు మున్సిపాలిటీ కూడా ప్రజలు గోడు ఆలకించడంలేదు. నరసరావుపేట మున్సిపాల్టీలో విలీనమైన రావిపాడు, కేసానుపల్లి, యలమందల, ఇస్సపాలెం, లింగంగుంట్ల పంచాయతీల పరిధిలోని ప్రజలు అనేక సమస్యలతో అల్లాడుతున్నారు. విలీనంతో ఆయా పంచాయతీలు, మున్సిపాల్టీకి ఎన్నికలు కూడా నిలిచిపోయాయి. కనీస వసతులు కల్పించాలని విలీన ప్రాంతాలవాసులు కోరుతున్నా వారి మొర ఆలకించే నాధుడే కరువయ్యాడు. విలీన ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. చివరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని దుస్థితి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక మట్టి రోడ్లతో ఆ ప్రాంతవా సులు అల్లాడుతు న్నారు. ఇక తాగునీటి కుళాయిలు కూడా మున్సిపాల్టీ మంజూరు చేయడంలేదు. మూడేళ్లుగా దాదాపు 4,400 అసెస్మెంట్ల నుంచి ఇంటి పన్ను వసూలు నిలిచిపోయింది. దీంతో బ్యాంకుల్లో రుణాలు కూడా పుట్టక యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి విలీన ప్రాంతాలు మున్సిపాల్టీ పరిధిలోకి వచ్చాయి. పంచాయతీలు సంబంధిత రికార్డులను మున్సిపాల్టీకి అప్పగించినా పన్నుల విషయంలో స్పష్టత లేదు. ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పన్ను విధించాల్సిన నేపథ్యంలో భారీగా పన్ను పెంచితే ఆ ప్రభావం ఎన్నికలపై పడుతుందనే ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం పన్నుల పెంపుదలను నిలిపివేసింది.

### అనుమతి కోసం ఎదురుచూపు

విలీన ప్రాంతాల్లోని ఇళ్లకు 15 శాతం పన్ను పెంచా లంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. లేదంటే అసెస్మెంట్ నెంబర్ నమోదు చేయగానే ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పన్ను వస్తుంది. ప్రభుత్వం అనుమతి ఇస్తే ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసి పాత పన్నుపై 15 శాతం మాత్రమే పెంచేందుకు అవకాశం ఉంటుంది. అనుమతి కోసం మున్సిపల్ అధికారులు ఎదురుచూస్తున్నారు. అప్పటి వరకు పన్ను వసూలు చేసే పరిస్థితిలేదని అధికారులు తెలిపారు. పంచాయతీలు అప్పగించిన రికార్డుల ప్రకారం ప్రతి ఆరు నెలలకు రూ.60 లక్షలు పన్ను వసూలు చేయాలి.



బాలయ్య నగర్‌లో మట్టి రోడ్డు



నరసరావుపేట మునిసిపాల్టీలో విలీనం అయిన రావిపాడు రోడ్డు ఏరియా

## ముగిసిన లాటరీ ప్రక్రియ

- గీత కులాలకు 13 మద్యం దుకాణాలు కేటాయింపు

నరసరావుపేట లీగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గౌడ, గౌడ్ సామాజిక వర్గాలకు కేటాయించిన మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని గీత కులాలకు 13 మద్యం దుకాణాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఆయా దుకాణాలకు 199 దరఖాస్తులు రాగా కలెక్టరేట్లో కలెక్టర్ అరుణ్‌బాబు లాటరీ తీశారు. దరఖాస్తుదారుల సమక్షంలో వీడియో రికార్డింగ్ ద్వారా పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహించినట్లు ఎక్సైజ్ జిల్లా అధికారి కే మణికంఠ తెలిపారు. దుకాణాలు దక్కించుకున్న లైసెన్స్‌దారుల్లో ఫీజు చెల్లించిన వారికి ప్రొవిజినల్ లైసెన్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎక్సైజ్ సీఐ సోమయ్య, ఎస్‌ఐలు సిబ్బంది, గౌడ కుల సంక్షేమ ప్రతినిధులు పాల్గొన్నారు.

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ : 6.22 (శుక్రవారం)
సహరి : 5.05 (శనివారం)

**నేటి నుంచి సాగరమాత మహోత్సవాలు**

10

**పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో నిందితుడి మృతి**

8

# ఉద్యోగినులకు క్రీడా పోటీలు

- ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు
- మహిళా దినోత్సవం రోజున విజేతలకు బహుమతుల పంపిణీ

నరసరావుపేట కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో గురువారం వివిధ శాఖల్లోని ఉద్యోగినులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రారంభించారు. వాలీబాల్, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్స్ లెమన్ అండ్ స్పూన్, కళ్లకు గంతలు తదితర పోటీలు నిర్వహించగా ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొనారు. పోటీల్లో దాదాపు 500 మంది వరకు మహిళా ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఆయా పోటీల్లో విజేతలకు ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో ఉద్యోగినులు కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. వీరందరికీ కలెక్టర్ స్వయంగా వడ్డన చేశారు. తొలుత ఉద్యోగినులు సేవలను స్మరించుకుంటూ కలెక్టర్, ఎస్పీ పింక్ బెలూన్లను ఎగరవేశారు. వేడుకల్లో భాగంగా పోలీసు ఆయుధాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి, డీఎఫ్‌వో కృష్ణప్రియ, ఆర్డీవో మధులత ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగరేసి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

లెమన్ స్పూన్ ఆట ఆడుతున్న మహిళా ఉద్యోగినులు



## గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

తాడికొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడికొండ ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.జోగారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిపోయిన ఖాళీ సీట్లలో ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25వ తేదీన దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## 15న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వి.జ్యోతి బసు వెల్లడించారు. అదే రోజు ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు స్టాండింగ్ కమిటీల సమావేశం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సాధారణ సర్వ సభ్య సమావేశం ఆరంభం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వార్షిక బడ్జెట్ పై చర్చ జరగనుంది.

## కలెక్టర్‌కు సరెండర్ చేసి నెల దాటినా ఇంకా విధుల్లోనే..

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తన కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు కలెక్టర్ అరుణ్‌బాబుకు జనవరి 20వ తేదీన సరెండర్ చేస్తూ బాలకృష్ణను రిలీవ్ చేశారు. ఈ సంఘటన జరిగి నెలరోజులు దాటినప్పటికీ సీనియర్ అసిస్టెంట్ కార్యాలయంలో ఆర్ఐ పాత్ర పోషిస్తూ నిబంధనలకు విరుద్ధంగా తన పనులు చేసుకుపోతున్నాడు. కార్యాలయం నుంచి రిలీవ్ కాలేదు. సీనియర్ అసిస్టెంట్ పదవీ కాలం రెండు సంవత్సరాలు పూర్తి కాకుండా ఆర్ఐ విధులు నిర్వహించకూడదని నిబంధనలు ఉన్నాయి. అయినా ఫ్యామిలీ మెంబరు ధ్రువీకరణ పత్రాలను వీఆర్‌వోలతో సంబంధం లేకుండా తానే అర్జీదారులను కార్యాలయానికి పిలుచుకుని విచారణ జరిపి తహసీల్దార్ ముందు ఉంచుతున్నారు. దానిని తహసీల్దార్ మంజూరు చేస్తున్నారు. అయితే సరెండర్ చేసిన తహసీల్దార్ మాచవరంకు ఇన్‌చార్జిగా వెళ్లడంతో ఇక్కడ తహసీల్దార్‌గా డానియేలును నియమించారు. నాగమల్లేశ్వరరావు మాచవరం వెళ్లినప్పటి నుంచి సీనియర్ అసిస్టెంట్ ఆర్ఐగా తన విధులు నిర్వహిస్తున్నాడు. కలెక్టర్‌కు సరెండర్ చేసి రిలీవ్ చేసినప్పటికీ హాజరులో సంతకం చేస్తున్నాడు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కొత్త బైపాస్‌లో సోలార్ కేబుల్ చోరీ

నాదెండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం, నాదెండ్ల గ్రామాల పరిధిలో కొత్తగా నిర్మించిన బైపాస్‌లో ఏర్పాటు చేసిన సోలార్ కేబుల్‌ను అపహరించారు. ఈ విషయ మైపీ స్పార్కిల్ ఎండీ కల్లూరు నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గణపవరం గ్రామ పరిధిలోని కొత్త బైపాస్‌లో సుమారు 10వేల మీటర్ల కేబుల్ చోరీకి గురైనట్టు పేర్కొన్నారు. కేబుల్‌లోని కాపర్ కోసం ఈ చోరీకి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేబుల్ విలువ సుమారు 2.20 లక్షలు ఉంటుందని వివరించారు.












# బోధనలో సమూల మార్పులు

- సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పోకడలు
- వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక సాంకేతిక యుగంలో బోధనా పద్ధతులు రూపాంతరం చెందుతున్నాయని ఏఎన్యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ పర్స్పెక్టివ్స్ అండ్ రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేటర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ బోధన పద్ధతులు నిరంతరం మారుతూనే ఉన్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది బోధన ఎక్కడ నుంచైనా వినే అవకాశం కలిగిందన్నారు. కరోనా తరువాత ఇటువంటి అవకాశాలు పుష్కలంగా రూపాంతరం చెందినట్లు వివరించారు. విద్యార్థి అనుకున్న రీతిలో బోధన పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. నేటి తరాన్ని తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు కూడా నూతన నైపుణ్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాదులోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యా విభాగం ఆచార్య వనజ మాట్లాడుతూ ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. దీనిని పసిగట్టాలంటే తప్పనిసరిగా విద్యావంతులు కనీస విద్య అవగాహన ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంచుకుంటున్నారని వివరించారు. జపాన్ దేశం 2017లోనే విద్య విధానంలో 5.0 విధానంలో దూసుకుపోతుందని పేర్కొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నశీలమణి మాట్లాడుతూ నాణ్యమైన బోధనకు అర్హత గల అధ్యాపకులు న్యాయం చేస్తారని సూచించారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో కొత్త మార్పులు వస్తాయన్నారు. సదస్సుకు 80 పరిశోధన పత్రాలు వచ్చాయని, వాటిని పుస్తక రూపంలో తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రముఖ విద్యావేత్త గద్దె మంగయ్య మాట్లాడుతూ అభివృద్ధికి విద్య అనేది మొదటి అడుగుగా అభివర్ణించారు. సదస్సుకు కన్వీనర్లుగా డాక్టర్ ఎం. వసంతరావు, డాక్టర్ రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ సందీప్ వ్యవహరించారు. సదస్సులో దేశంలోని పలు కేంద్రీయ విశ్వవిద్యాలయాల నుంచి సీనియర్ అధ్యాపకులు ప్రొఫెసర్స్ కె.సుమలత, వి.రవి, పి.ఆడం పాల్, టి.షారోన్ రాజు, ఈ. అశోక్ కుమార్, టి.ఇస్మాయిల్, పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నందిగం, కొల్లా వివాహ మహోత్సవం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

- పలువురు ప్రముఖుల హాజరు

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్‌లో శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ నందిగం శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతుల కుమారుడు సునీల్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త కొల్లా శ్రీమన్నారాయణ, మాధవి దంపతుల కుమార్తె నూతన వివాహ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు (గురజాల) నక్కా ఆనందబాబు (వేమూరు), జూలకంటి బ్రహ్మారెడ్డి (మాచర్ల), ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎస్‌పీఎఫ్ ఐజీ త్రివిక్రమవర్మ, శ్రీరామ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వైస్ చైర్మన్ ఆర్ దుర్వాసన్, హైదరాబాద్ రెరా డిప్యూటీ డైరెక్టర్ (టెక్నికల్) నాదెండ్ల తిరుపతయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు పంచుమర్తి భూపతిరావు, ఈడే మురళీకృష్ణ, పలువురు ప్రముఖులు ఆశీర్వదించారు.

# మంగళాద్రిలో వైభవంగా ధ్వజారోహణం

- సకల దేవతలకు బ్రహ్మోత్సవ ఆహ్వానం

మంగళగిరి సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో కీలక ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను, భక్తజనులను ఆహ్వానించేందుకు శ్రీస్వామివారి సేవకుడైన గరుత్మంతుని పంపిస్తూ గరుడ ధ్వజాన్ని ఆవిష్కరించడం సంప్రదాయంగా వస్తోంది. దీనిప్రకారం గరుత్మంతుని చిత్రం ముద్రించిన పతాకాన్ని గరుడ ధ్వజంగా ధ్వజ స్తంభానికి ఆవిష్కరిస్తూ ధ్వజారోహణం గావించారు. ఋత్విగ్వరణ, అంకురారోపణాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అర్చక స్వాములు ఈ ఉత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టనాగాధిపతియైన గరుత్మంతునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దల పేరుతో భక్తులకు పంపిణీ చేశారు. సంతానం లేని మహిళలు ఈ ప్రసాదాన్ని స్వీకరించినట్టయితే వారికి శీఘ్రగతిన సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ కారణంగా గరుడ ముద్దలను స్వీకరించేందుకు పలువురు మహిళలు



గరుడ ముద్దలను ప్రసాదంగా స్వీకరిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనృసింహస్వామి

ధ్వజారోహణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఈ ఉత్సవానికి మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ వారు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ధ్వజారోహణ ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో నియమ నిష్ఠలతో నిర్వహించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### నేటి నుంచి వాహన సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం నుంచి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి ప్రధాన వాహన సేవలు ఆరంభం కానున్నాయి. తొలిరోజు స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తారు. 8న రాజాధిరాజ వాహనం, 9న ఉదయం ముత్యాల పల్లకీ వాహనం, రాత్రి యాలి వాహనం, 10న ఉదయం చిన్న శేష వాహనం, అదేరోజు రాత్రి సింహ వాహనం, 11న ఉదయం హంస వాహనం, అదేరోజు రాత్రి గజ వాహనం, 12న ఉదయం కల్పవృక్ష వాహనం, అదేరోజు రాత్రి పొన్న వాహన సేవ, 13న ఉదయం అశ్వ వాహన సేవ నిర్వహిస్తారు. అదేరోజు అర్ధరాత్రి స్వామివార్ల కల్యాణం జరుగుతుంది.

# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మే 18 నుంచి 20 వరకు గుంటూరులో జరగనున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ నాగబ్రహ్మాచారి, సీపీడీసీఎల్ అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని సీఐటీయూ నగర కార్యాలయంలో రాష్ట్ర మహాసభల ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకునేందుకు రాష్ట్ర మహాసభల్లో కీలకమైన నిర్ణయాలు చేసేందుకు వేదిక కానున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బి. లక్ష్మణరావు, నాయకులు సుబ్బారెడ్డి, రాం ప్రభాకర్, చెన్నకేశవులు,



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

చంద్రశేఖర్ ఆచారి, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

నరసరావుపేట లీగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్ దారులు, చిట్టీ పా టదారుల నుంచి సుమారు రూ. 400 కోట్ల మేరకు వసూలు చేసి మోసం చేసినట్లు నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో దాఖలైన కేసులో చిట్‌ఫండ్స్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నరసరావుపేట 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో శుక్రవారం వాదనలు జరగనున్నాయి.. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి మొదటి పట్టణ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పాలడుగు పుల్లారావు, అతని కుటుంబ సభ్యులు నిందితులుగా ఉన్నారు. పుల్లారావుపై గుంటూరులో మరో కేసు నమోదు అవ్వడంతో సదర కేసులో గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మొదటి పట్టణ పోలీసులు పుల్లారావును పీటీ వారెంట్‌పై స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పోలీసు కస్టడీకి అడుగుతూ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం పిటిషన్ పెండింగ్‌లో ఉంది.

## ఆటోలో ప్రయాణికుడిగా ఎక్కి దోపిడీ

తెనాలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణికుడిగా ఎక్కి విచక్షణా రహితంగా దాడి చేసి డబ్బు దోచికెళ్లిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సీఎం కాలనీకి చెందిన తుమ్మపూడి అశోక్ కుమార్ గుడివాడలో డ్వాక్రా డబ్బులు చెల్లించేందుకు ఆటోలో వెళుతున్నాడు. మార్గమధ్యలో కఠెవరం గేట్లు దాటిన తరువాత జనసంచారంలేని ప్రాంతంలో ఓ వ్యక్తి ఆటోలో ఎక్కించుకోవాలని ఆపాడు. ఆటోలో ఎక్కి బండి కదిలిన వెంటనే వెనుక మెడపై పదునైన వస్తువుతో విచక్షణారహితంగా దాడి చేసి అశోక్ కుమార్ వద్ద ఉన్న రూ.11000 తీసుకుని పరారయ్యాడు. మెడ, చేతుల భాగంలో తీవ్ర గాయాలతో బాధితుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఆటోలో తెనాలి చేరుకున్నాడు. గాయాలతో ఉన్న బాధితుడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షలు జరిపి చికిత్స అందిస్తున్నారు.

## బ్లేడుతో కుటుంబ సభ్యులపై దాడి

చిలకలూరిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రజక కాలనీకి చెందిన జి.మణికుమార్ దుర్వసనాలకు బానిసై మద్యం తాగడానికి అడిగిన డబ్బులు రూ.30 వేలు ఇవ్వలేదని కుటుంబ సభ్యులతో సహా నలుగురిని దారుణంగా బ్లేడుతో కోసి గాయపరిచిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. గాయపడిన వారిలో కుటుంబ సభ్యులు అయిన తండ్రి కృష్ణారావు, పిన్ని రాజేశ్వరి, అక్క నాగలక్ష్మి, మరో వ్యక్తి హరీష్ ఉన్నారు. పోలీసులకు సమాచారం తెలియడంతో అర్బన్ సీఐ పి.రమేష్, ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు జగన్‌కు లేదు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి రాని వ్యక్తికి హామీలపై ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ప్రశ్నించారు. విలేకరులతో మాట్లాడుతూ ఆయన అబద్ధాలు, మోసాలు, హత్యా రాజకీయాలతో ముఖ్యమంత్రి పదవి దక్కించుకొని, 5 ఏళ్ల రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. తమ జీవితాలకు సున్నా చుట్టాడనే జగన్‌కు, వైసీపీకి జనం సున్నం బొట్టు పెట్టి మరీ సాగనంపారని అన్నారు. యువతను, నిరుద్యోగుల్ని తానే ఉద్ధరించినట్లు జగన్ మాట్లాడటం హాస్యాస్పదం అని చెప్పారు. 40 లక్షల ఉద్యోగాలు ఇస్తే వైసీపీ పట్టభద్ర ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదో జగన్ చెప్పాలని అన్నారు. రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న ఆర్థిక కష్టాలను అధిగమిస్తూ, ప్రజలకిచ్చిన ప్రతి హామీ అమలుకు కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందని వివరించారు. ఎన్నికల ప్రచారంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిలో ఎన్ని అమలు చేశారో ప్రజల్లోకి వచ్చి జగన్ చెప్పగలడా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా పరదాల చాటున, ఇప్పుడేమో నాలుగు గోడల మధ్యన, అదే జగన్‌కు తెలిసిన పాలన అని చెప్పారు.

## అహంకార ధోరణి వీడలేదు

- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి ఇంకా అధికారంలోనే ఉన్నామనే భ్రమతో మాట్లాడుతున్నారని, అహంకార ధోరణి వీడలేదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉండగా అవినీతి, అక్రమాలు చేయడమే కాకుండా చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌ను, వారి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబును అక్రమ అరెస్టు చేయడం వలన రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని అధికారంలో నుంచి దించి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. 11 సీట్లకే పరిమితం చేసినా జగన్మోహన్‌రెడ్డిలో మార్పు లేదని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. తల్లిని, చెల్లిని గౌరవించలేని వ్యక్తి, ఎదుటి వ్యక్తులను ఎలా గౌరవిస్తారనేది అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. జగన్ లాంటి వ్యక్తులను రాజకీయాల నుంచి కాదనీ, సమాజం నుంచే వెలివేయాలని యరపతినేని మండిపడ్డారు.

## మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులు



విశాలాక్షికి బహుమతి అందజేస్తున్న బుడితి రాజశేఖర్, శారదా జయలక్ష్మి

గుంటూరు సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులని ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ అన్నారు. లాం ఫామ్‌లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో గురువారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి డీన్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ, మహిళా రక్షణ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ ఎ.మణి అధ్యక్షత వహించారు. ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఏర్పాటు ద్వారా మహిళల జీవితంలో పెను మార్పులు సంభవించాయని అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారిని సన్మానించడంతో పాటు, మహిళా రైతులను సన్మానించడం గొప్ప భాగ్యమన్నారు. యూనివర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉన్నారని తెలిపారు. అనంతరం ఆయా జిల్లాలకు చెందిన మహిళా రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో మృతి

నరసరావుపేట లీగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకోవటానికి ఓ లాడ్జిలోని మేడపై బాత్రూంలో ఏర్పాటు చేసిన వెంటిలేటర్ కిటికీ నుంచి కిందకు దూకి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. రెండో పట్టణ ఎస్సై అశోక్ బాబు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ మారేడుమిల్లిలోని తుకారాం గేట్‌కు చెందిన రాములు నాయక్ పై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 22 కేసులు పెండింగ్ ఉన్నాయి. గత నెలలో నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దేవాలయంలో చోరీ కేసులో నాయక్ నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసుకు సంబంధించి బుధవారం అతని భార్యతో కలిసి పట్టణంలోని కోర్టుకు వాయిదా నిమిత్తం వచ్చాడు. రాములు నాయక్ గుంటూరు జిల్లా పత్తిపాడు పరిధిలోని ఓ దేవాలయంలో కూడా చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకున్న గుంటూరు సీసీఎస్ పోలీసులు రాములు ఆచూకీ తెలుసుకొని అదుపులోకి తీసుకున్నారు. రాములు నాయక్‌కు విరోచనాలు అవుతుండడంతో అతని భార్య అభ్యర్థన మేరకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగల లాడ్జిలో బాత్రూమ్‌కు రాములు వెళ్లాడు. బాత్రూం తలుపులు వేసుకొని వెంటిలేషన్ ఫ్యాన్‌ను తీసివేసి ఆ రంధ్రం నుంచి దూకి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న నరసరావుపేట రెండో పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ బాబు తెలిపారు.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 525.80 అడుగులు ఉంది. ఇది 160.06 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8541 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,644 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 91, 99, 110 |
| చికెన్ విత్ స్కిన్ | 176.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 186.00 |

## 1,19,950 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,16,671 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,19,950 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 54,938 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 9500 | 13800 |
| నంబరు. 5 | 10000 | 13500 |
| 273 | -- | -- |
| 341 | 10500 | 14500 |
| 4884 | 10000 | 11000 |
| సూపర్ 10 | -- | -- |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 10500 | 14000 |

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| షార్క్-1 | 11500 | 12800 |
| బ్యాడిగి 355 | 10500 | 13800 |
| సింజెంటా | | |
| బ్యాడిగి 5531 | 10500 | 12200 |
| ఎస్ఎస్ 250 | | |
| బుల్లెట్ | -- | -- |
| దేవనూరు డీలక్స్ | 10000 | 13300 |
| ఆర్మూరు | 10000 | 11300 |
| తాలుకాయలు | 5000 | 7500 |

### పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 30.89 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని రాజు తెలిపారు.

### పక్కా గృహాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోండి

మాచర్లటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ, మండల ప్రాంత ప్రజల పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని హౌసింగ్ డిప్యూటీ ఈఈ బాలాజీనాయక్ కోరారు. గురువారం పట్టణంలోని హౌసింగ్ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పక్కా గృహాలు లేని వారు ఈనెల 31వ తేదీలోగా తమ పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ మరియదాసు,డీఈవో ఫణీంద్ర, తేజ, మహేంద్ర, ఎలిసమ్మ పాల్గొన్నారు.

### పోలీస్‌స్టేషన్‌లో 'ఓపెన్ హౌస్ '

గురజాలటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ భాస్కర్ ఆధ్వర్యాన ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని శివాని స్కూల్ విద్యార్థినులకు పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల విధుల గురించి సీఐ భాస్కర్ వివరించారు. కార్యక్రమలో ఎస్ఐ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ శాఖ ఏఈగా ప్రసాద్

గురజాలటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గురజాల విద్యుత్‌శాఖ ఏఈగా వివి ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు రెంటచింతల ఏఈ మస్తాన్‌వలి ఇన్‌చార్జి ఏఈగా వ్యవహరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌కు సిబ్బంది అభినందనలు తెలిపారు.

### నేడు పీ4 సర్వేపై శిక్షణ

మాచవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 7వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ - 4 సర్వేపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంగళరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించే విధానంపై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 8 నుంచి 18వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. సర్వే పర్యవేక్షకులను నియమించటం జరిగిందని, వారు కూడా శిక్షణకు హాజరు కావాలన్నారు.

### 12న సర్వసభ్య సమావేశం

మాచవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంగళరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు ఆయా శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు.

### తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించండి

మాచవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా సేకరిస్తున్న తడి చెత్త - పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని క్లాప్ మిత్రలకు ఎంపీడీవో వెంగళరావు సూచించారు. గురువారం మండలంలోని పిల్లుట్ల గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి క్లాప్ మిత్రలకు సూచనలు, సలహాలు చేశారు. సేకరించిన చెత్తను తప్పని సరిగా సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయ తీ సెక్రటరీ ప్రసాదు, క్లాప్ మిత్రలు ఉన్నారు.

### జూదరులు అరెస్టు

రెంటచింతల,మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామంలో జూదమాడుతున్న ఎనిమిది మందిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూదరుల నుంచి రూ.10,280 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### కోలాహలంగా తిరునాళ్ల

ముప్పాళ్ల, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొళ్లపాడు గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. గొళ్లపాడు, ముప్పాళ్ల, కుందురువారిపాలెం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 41రోజుల పాటు స్వామి మాల ధరించి నియమాల పాటించిన స్వాములు గురువారం స్వామివారిని దర్శించుకుని మాల విరమణ చేశారు.

### చికిత్సపొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

దాచేపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నడికూడి రైల్వే స్టేషన్ వద్ద జనవరి 23న స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తి గురువారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందినట్టు దాచేపల్లి పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నడికూడి రైల్వే స్టేషన్‌లో స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేయటంతో ఆ వ్యక్తిని పోలీసులు గురజాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి సమాచారం కోసం 9440 796239కి ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

## అగ్గి రేగితే బుగ్గే..

- 90 గ్రామాలకు ఒక్కటే అగ్నిమాపక యంత్రం
- ఎటు వెళ్లాలన్నా రెండు గంటల సమయం
- గమ్యం చేరే లోపే అధిక మొత్తంలో నష్టం
- మరొక యంత్రాన్ని కేటాయిస్తేనే ఊరట..
- సమస్యలతో అగ్నిమాపక సిబ్బంది సతమతం


క్రోసూరు అగ్నిమాపక కేంద్రం


మంటలను ఆర్పుతున్న ఫైర్‌మెన్‌లు(ఫైల్ ఫోటో)

క్రోసూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం క్రోసూరులో పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు గాను ఒక అగ్నిమాపక కేంద్రం ఉంది. నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో సుమారు 90 గ్రామాలకు 6 వేలలీటర్ల నీటి కెపాసిటీ సామర్థ్యంతో అగ్నిమాపక యంత్రం మాత్రమే సేవలను అందిస్తోంది. అగ్నిమాపక కేంద్రంలో 16 మంది సిబ్బంది, ఇద్దరు డ్రైవర్లు, 14 మంది ఫైర్‌మెన్‌లు 24 గంటలు అందుబాటులో ఉంటున్నారు.

2008లో అప్పటి మంత్రి కన్నా లక్ష్మీనారా యణ హయాంలో సింగిల్ యూనిట్ ఫైర్ స్టేషన్‌గా అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వహణలో ఈ అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం మ్యాప్ టెక్నాలజీ సర్వీస్ ప్రొవైడర్ ఆధ్వర్యంలో అగ్నిమాపకకేంద్రం నడుస్తుంది. గత ఆరు సంవత్సరాల్లో ఈ కేంద్రం పరిధిలో సుమారు 248 ఘటనలు జరిగాయి. రూ.3 కోట్ల ఆస్థి నష్టం జరిగింది.

క్రోసూరు అగ్నిమాపక కేంద్రం నుంచి బెల్లంకొండ మండలంలో మాచాయపాలెం వరకు అమరావతి మండలంలో ధరణికోట వరకు, పెదకూరపాడు మండలంలో హుస్సేన్‌నగరంవరకు, అచ్చంపేట మండలంలో మాదిపాడు వరకు, క్రోసూరు మండలంలో పీసపాడు వరకు ఈ అగ్నిమాపక యంత్రం సేవలు విస్తరించి ఉన్నాయి. క్రోసూరు కేంద్రం నుంచి ఎటు వెళ్ళాలన్నా ఏ మండలానికి వెళ్లాలన్నా సుమారు గంటన్నర నుంచి 2 గంటల సమయం పడుతుంది. ఈ లోపల జరగాల్సిన నష్టం జరిగి పోతోంది.

2023-24లో అచ్చంపేట మండలం మిట్టపాలెంలో జరిగిన ఘటనలో అగ్నిమాపక యంత్రం వెళ్ళే సరికే మంటల్లో చిక్కుకున్న ఆరు నెలల శిశువు మరణించింది. ఏదేని అగ్ని ప్రమాద ఘటన సంభవించినప్పుడు నష్టాన్ని పూర్తిగా నివారించాలన్నా, కొంత మేర నష్టాన్ని తగ్గించాలన్నా మరొక అగ్నిమాపక యంత్రం ఉంటే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఆమేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరొక అగ్నిమాపక యంత్రం ఈ కేంద్రానికి మంజూరు కావాలంటే ప్రభుత్వ అనుమతి కావాలని సర్వీస్ ప్రొవైడర్ మార్కాపురపు ప్రసాదు తెలియ జేశారు. అలాగే క్రోసూరులోని అగ్నిమాపక కేంద్రంలో తమకు విశ్రాంతి తీసుకొనేందుకు డార్మెటరీ సౌకర్యం, మరుగుదొడ్లు వంటి సౌకర్యాల ఏవి లేవని సిబ్బంది చెపుతున్నారు.

## వడ దెబ్బకు గురికావొద్దు

పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డి






రెంటచింతల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతకు పేరు గాంచిన ప్రధానమైన ప్రాంతాల్లో రెంటచింతల ఒకటి. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా ఎండ వేడిమి అధికమైంది. దీంతో పాటు వడ గాల్పులు వీయడం ప్రారంభమైంది. ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమై ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంటుంది. దీనిని వడదెబ్బ అని అంటాము. వడ దెబ్బ లక్షణాలు, వడ దెబ్బ తగల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రెంటచింతల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డితో ఆంధ్రజ్యోతితో ఫటాఫట్ ఇంటర్వ్యూ..

- **వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఎవరికి ఎక్కువగా ఉంది..?**
  శిశువులు, పసి బిడ్డలు, వృద్ధులు అధిక శరీర శ్రమ చేసే వారు లేదా ఎక్కువ గంటలు ఎండలో తిరిగే వ్యక్తులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది.
- **వడ దెబ్బ లక్షణాలు ఏమిటి ?**
  కండరాలు తిమ్మిరి, బాగా చెమట పట్టడం, బలహీనత, తలనొప్పులు, వాంతులు, అధిక హృదయ స్పందన, పాలిపోయిన చర్మం వంటివి వడ దెబ్బ లక్షణాలుగా ఉంటాయి.
- **వడదెబ్బ తగిలినపుడు ఏం చేయలి?**
  నీడగా చల్లగా వుండే ప్రదేశంలో బాధితులనుంచాలి. స్పాంజి, తడి టవల్‌తో నుదురు, మెడ, శరీరాన్ని తుడవాలి
- **వడదెబ్బ నివారణకు చిట్కాలు ఏమిటి ?**
  ఓఆర్ఎస్ అంటే ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్‌ను నీటిలో కలుపుకుని తాగాలి. ఆల్కహాలుకు పూర్తిగా దూరంగా ఉండాలి.
- **ఏయే పండ్లు తీసుకోవాలి ?**
  దోసకాయ, పుచ్చకాయ, అరటిపండు, దానిమ్మ వంటి ద్రవ పూరిత పండ్లను ప్రతి రోజూ తీసుకోవాలి.

## నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

- జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ డాక్టర్ పత్తిపాటి విజయకుమార్


సబ్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ విజయ కుమార్

బెల్లంకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ డాక్టర్ పత్తిపాటి విజయకుమార్ అన్నారు. గురువారం మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెంలో 133కేవీ, 33/కేవీ సబ్ స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అయ్యే విద్యుత్ వివరాలను స్థానిక అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమష్టి కృషి ద్వారానే ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించగలమని, అందుకు తగిన విధంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆయనవెంట డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సింగయ్య, పిడుగురాళ్ళ డీఈ సురేష్ బాబు, మండల ఏఈ పవన్‌కుమార్, ఏఈలు, ఎల్‌ఐలు ఉన్నారు.

### ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

- ఏవో యలమందారెడ్డి

కారంపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానాలు ఎంతో మేలని ఏవో యలమందారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద వ్యవసాయ, సెర్ప్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు పొలంలో నవధాన్య విత్తనాలు చల్లాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా చీడపీడల్ని నివారించవచ్చన్నారు. అనంతరం సిబ్బందికి నవ ధాన్య విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రం, ఏపీఎం శివకుమార్, సీసీ మల్లేశ్వరరావు, వీరకుమారి, సుజాత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలరాజు, బాజీబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి పనుల పరిశీలన

ముప్పాళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదల, రుద్రవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీవో ఏడుకొండలు పరిశీలించారు. మండలంలో 11 గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో 497 మంది కూలీలు పాల్గొన్నారని తెలిపారు. ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే రూ.300 కూలీ వస్తుందని అన్నారు. భూగర్భ జల వనరులను పెంచటంతో పాటు వేసవిలో నీటిని కాపాడుకునేందుకు ఉపయోగపడే ఫారం పాండ్‌లను పొలాల్లో తీయించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు.

### పోలీసు హెల్ప్ లైన్ నెంబర్లు

సత్తెనపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసలైన పిల్లలను ఎవరైనా గమనిస్తే వెంటనే 1098 చైల్డ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని డీఎస్పీ ఎం హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా సంస్థల్లో గంజాయిపై 1972 నెంబరుకు, గృహ హింస వరకట్న వేధింపులు, లైంగికహింస, పని చేసే చోట వేధింపులు, మహిళల అక్రమ రవాణాపై 181 నెంబరుకి, ఎవరు ఎప్పుడు ఎక్కడ ఏ ఆపదలో ఉన్నా 112 నెంబరుకు సమాచారం అందించాలన్నారు. సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని ప్రజలు ఈ నెంబర్లను తమ వద్ద భద్రంగా ఉంచుకోవాలని కోరారు. శాంతి భద్రల పరిరక్షణలో పోలీసు శాఖకు ప్రజలంతా సహకరించాలన్నారు.

### మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని


మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఆయన కుమారుడు నిఖిల్

పిడుగురాళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో గురువారం అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర ఐటి శాఖా మంత్రి నారా లోకేశ్‌ను ఆయన నివాసంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్‌తో యరపతినేని మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు తాజా రాజకీయ పరిణామాల గురించి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని లోకేశ్‌ను కోరారు. గురజాల ప్రజలు ఆకాంక్షలను నెరవేర్చేలా నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానని ఈ సంద ర్భంగా యరపతినేనికి లోకేశ్ హామీ ఇచ్చారు.

### విద్యుత్ మీటర్లను క్రమబద్ధీకరించుకోవాలి

రెంటచింతల,మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించేందుకు 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందని ఏపీ ట్రాన్స్‌కో ఈఈ నూతలపాటి సింగయ్య తెలిపారు. గురువారం పాలువాయిలో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ మీటరు సామర్థ్యం పెంపు కోసం ఒక కిలోవాట్‌కు నిర్ణయించిన ధర మొత్తంలో సగం చెల్లిస్తే చాలని, ఈ అవకాశం జూన్ 30 వరకు ఉంటుందన్నారు. విద్యుత్ సిబ్బంది, లేదా ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా ఈ క్రమబద్ధీకరణను చేయించుకోవచ్చని సింగయ్య పేర్కొన్నారు.

### 11న ఆలయం వద్ద దుకాణాలకు వేలం

బెల్లంకొండ,మార్చి6(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ అడ్డరోడ్డు వద్దనున్న కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద దుకాణాల విక్రయ వేలంను ఈ నెల 11న నిర్వహిస్తున్నట్టు దేవాదాయ శాఖ గ్రూపు మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, దేవుళ్ళ బొమ్మలు, కొబ్బరిచిప్పలు, తల నీలాలు పోగుచేసుకొనుట, క్యాంటీన్, ప్రసాదాల అమ్మకం హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. షాపులు దక్కించుకున్నవారు ఏప్రిల్ 1నుంచి 2026 మార్చివరకు విక్రయించు కోవచ్చని తెలిపారు.


రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి

### రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

- ఆర్డీవో రమా కాంత్‌రెడ్డి

రాజుపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో భూముల రీసర్వే ప్రాంతాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రైతులు, రీసర్వే పాల్గొంటున్న సిబ్బంది బృందాలతో మాట్లాడారు. ఈ గ్రామంలో రీసర్వే పనుల్లో మొత్తం నాలుగు బృందాలు పని చేస్తున్నాయని, వారికి సహకరిస్తే భవిష్యత్‌లో భూ సమస్యలు ఏవీ ఉండవని రైతులకు సూచించారు. రైతులు వారివద్ద ఉన్న భూ పత్రాలను రీసర్వే బృందాలకు అందజేయాలన్నారు. ప్రతి ఒక్క రైతు రీసర్వేకు సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ దుర్గేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ జానీబాషా, సిబ్బంది ఉన్నారు.

### వాహనాల తనిఖీ

దుర్గి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం దుర్గిలోని పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. అధికలోడు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా నడుస్తున్న వాహనాలను తనిఖీ చేసి ఎస్ఐ సుధీర్‌కుమార్ జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వీరయ్య, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

### వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కారంపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్సీ కాలనీలో గల షిర్డీసాయి మందిర వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు సాయి పారాయణ గావించారు. ఆలయ కమిటి అధ్యక్షుడు చిరుమామిళ్ల కోటేశ్వరరావు, శ్రీనివాసరావులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు.

### కందిపప్పు మిల్లులో చోరీ

సత్తెనపల్లి, మార్చి6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి గుడి ఎదురుగా ఉన్న కందిపప్పు మిల్లులో బుధవారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. గురువారం ఉదయం నిర్వాహకులు మిల్లును తెరిచి చూడగా వెనుకవైపు షట్టర్లు తొలగించి ఉండటం, మిల్లులోని టేబుల్ సొరుగులో ఉన్న రూ.35 వేలు నగదు కనిపించక పోవడాన్ని గుర్తించారు. అనంతరం ఈ ఘటనపై మిల్లు నిర్వాహకుడు జవ్వాజి రవికృష్ణ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మరోసారి నోటీసులు ..

పిడుగురాళ్ల,మార్చి6(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో, రాష్ట్ర రహదారి ఇరువైపుల ఉన్న అనధికార లే అవుట్‌లపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుర్తించిన అనధికార లేఅవుట్‌ల యజమానులకు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు. సోమవారం లోగా నోటీసులకు సమాధానం రాకుంటే అనధికార లేఅవుట్‌ల తొలగింపునకు ఉన్నతాధికారులు తగు ఆదేశాలిచ్చినట్లు మున్సిపల్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.


విద్యార్థినికి పెన్నులు, ప్యాడ్ అందజేస్తున్న వేగుంట రాణి

### పరీక్షా సామగ్రి అందజేత

క్రోసూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఊటుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గురువారం తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి పరీక్షల సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.ప్రకాశరావు, ఉపాధ్యాయులు ప్రేమవాణి, టీడీపీ నాయకులు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయ నిర్మాణానికి శంకు స్థాపన చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గారపాడు గ్రామంలో గంగా భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాల పాటి శ్రీధర్ ముఖ్య అతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మార్కెట్ యార్డు కమిటీ మాజీచైర్మన్ పెనుముచ్చు రామారావు, వసంత సాయి కృష్ణ ప్రసాదు, దేవస్థాన నిర్మాణ కమిటీ అధ్యక్షులు పెనుముచ్చు శ్రీనివాసరావు, కార్యదర్శి బండారు నవీన్, దేవస్థాన శంకు స్థాపన అన్నదాన కార్యక్రమానికి, అన్నదాన కార్యక్రమానికి విరాళాన్ని అందించిన కోట శివరామకృష్ణ ప్రసాదు, ఆయన సతీమణి విజయ దంపతులు, కుమారుడు చరణ్, శ్రీజ దంపతులకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కొమ్మాలపాటికి శివ పార్వతుల చిత్రపటాన్ని దేవస్థాన కమిటీ ప్రతినిధులు అందించారు. అనంతరం వచ్చినటువంటి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



## ఉద్యోగులూ నిరుపేదలే ..!

- జగనన్న కాలనీల్లో సచివాలయ సిబ్బందికి ప్లాట్లు
- వివిధ ప్రాంతాల్లో వైసీపీ కార్యకర్తలకూ..
- రీ సర్వేలో విస్తుపోయేలా నిజాలు


పిడుగురాళ్ల సమీపంలోని లెనిన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ

పిడుగురాళ్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇల్లులేని నిరుపేదలకు స్థలం కేటాయించాలంటే నివాసం వుంటున్న పట్టణం, గ్రామాలకు చెందిన వారికే అదే ప్రాంతంలో స్థలం మంజూరు చేయాల్సి కానీ గత ప్రభుత్వ హయాంలో అవేమి పట్టకుండా ఎవరెక్కడి వారైనా మనవాడైతే సరి.. అన్నట్లుగా జగనన్న కాలనీలో వైసీపీ కార్యకర్తతో పాటు సచివాలయ అధికారులకు, సిబ్బందికి ప్లాట్లు కేటాయించారు. నవరత్నాల పేరుతో జగనన్న కాలనీలో గతంలో ఇళ్ల స్థలాలు పొందిన వారిపై కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ ప్రారంభించింది. దీనిలో వెలుగుచూస్తున్న వాస్తవాలు విస్తుపోయేలా ఉన్నాయి.

పిడుగురాళ్ల పట్టణంలో లెనిన్‌నగర్, ఆదర్శ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, ఎస్‌పి కాలనీలో జగనన్న ప్లాట్లను సుమారు 3,800 మంది లబ్ధిదారులకు కేటాయించారు. గత నెలలో జరిపిన రీసర్వేలో విస్తుపోయే నిజాలు సర్వే అధికారులు గుర్తించారు. జగనన్న కాలనీలో సచివాలయ ఉద్యోగుల కుటుంబసభ్యులకు, వలంటీర్లుగా పనిచేస్తున్న వ్యక్తులకు కేటాయించడంతో పాటు దాచేపల్లి మండలానికి చెందిన వారికి కూడా పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని జగనన్న కాలనీలో ప్లాట్లు కేటాయించినట్లు రీసర్వేలో అధికారులు గుర్తించడం జరిగింది. ఒక్క పిడుగురాళ్ల మండలంలోనే కాదు, మిగిలిన మండలాల్లోనూ ఇదే తరహాలో సమీప మండలాల వారికీ జగనన్న కాలనీలలో ఇళ్లస్థలాలు కేటాయించారు. పిడుగురాళ్ల సమీప మండలాలకు చెందిన వారు, సచివాలయ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, వలంటీర్లు, వారి కుటుంబసభ్యుల పేర్లతో సుమారు 400 మందికి పైగా ప్లాట్లు కేటాయించినట్లు గుర్తించి వాటిని అనర్హత కింద రద్దుకు రెవెన్యూ ఉన్నతాధికారులకు నివేదిక పంపడంతో పాటు క్షేత్ర స్థాయిలోనూ ఆన్‌లైన్‌లో రద్దుకు సిఫార్సు చేయడం జరిగింది. నిరుపేదలకు ఇళ్ల స్థలం కేటాయింపులో ఆధార్ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని ఇళ్ల స్థలాలు కేటాయించాల్సి వున్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు చెప్పిన వారికే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను ఇష్టారాజ్యంగా కేటాయించిన విషయం తెలిసిందే.

# ఎకోటూరిజం.. ఎంజాయ్ చేద్దాం!


బాపట్ల మండలం సూర్యలంక తీరానికి సమీపంలో ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేసిన ఎకోటూరిజం ప్రధానద్వారం

- పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు
- మరింత అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- నిధులు రాగానే అధునాతన సౌకర్యాలు


ఎకో టూరిజంలోని పర్యాటకులు తిరిగేందుకు ఏర్పాటుచేసిన సైకిళ్ళు


డార్మిటరీలోని బెడ్‌లు

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్ర తీరంలో ఎకోటూరిజంను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. కాటేజీల చుట్టూ 45 రకాల మొక్కలు పెంచుతున్నారు. వేసవిలో కూడా చల్లటి వాతావరణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ కాటేజీలలో సరదాగా గడిపేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎకోటూరిజంనకు ఆ తర్వాత వైసీపీ పాలనలో ఆదరణ కరవైంది. దీని అభివృద్ధిని గాలికి వదిలేశారు. మొక్కుబడిగా నిర్వహిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై మళ్లీ దృష్టిసారించింది. ఎకోటూరిజంలో 6 కాటేజీలు, ఒక డార్మేటరి, రెస్టారెంట్, వాటర్‌ప్లాంట్ ఉన్నాయి. ప్రస్తుతం మరో 6 కాటేజీలు అత్యాధునికంగా ఏర్పాటు చేస్తున్నారు. వీటితో మొత్తం 12 కాటేజీలు ఒక డార్మేటరి ఉంటాయి. జీడిమామిడి తోటల మధ్య 45 రకాల చెట్లు, మొక్కల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడముచ్చటగా ఉన్న కాటేజీలలో సేద తీరేందుకు దూరప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని పర్యాటకులు వస్తున్నారు. సూర్యలంక నేచర్ క్యాంపు రిసార్ట్స్‌గా ఏర్పాటు చేసిన ఎకోటూరిజంలో బీచ్ సఫారి, సైకిల్ సఫారి సదుపాయం కల్పించారు.

**కాటేజీల ధరలు ఇలా..**

సూర్యలంక తీరంలోని ఎకోటూరిజం కాటేజీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. ఉదయం 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9గంటల వరకు ఒకరోజుగా పరిగణిస్తారు. సోమవారం నుంచి గురువారం వరకు కాటేజీకి రూ. 3,265 చెల్లించాలి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు రూ. 3,592 చెల్లించాలి. డార్మేటరిలో 6 బెడ్‌లు ఉంటాయి. దీనికి రూ.4,816 చెల్లించాలి. ఎక్స్‌ట్రా బెడ్‌కు విడి రోజుల్లో రూ. 998, వీకెండ్‌లో రూ. 1098 చెల్లించాలి. చిన్నచిన్న ఫంక్షన్లు, పార్టీలు, ఫొటోషూట్‌లు తీసుకునే అవకాశం కల్పిస్తున్నారు.

**అభివృద్ధి వైపు అడుగులు**

సముద్రానికి కొంత దూరంగా ఎకోటూరిజం ఉండటం వల్ల పర్యాటకుల ఆదరణ తక్కువగానే ఉంది. సముద్రం ఎదురుగా ఉండే కాటేజీలకే ఆదరణ ఎక్కువగా ఉంది. అయితే ఇక్కడపచ్చటి మొక్కలు, చెట్లు, ఆహ్లాదాన్ని పంచేవిధంగా ఉన్నాయి. ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రకృతి మధ్య ఉండాలనుకునేవారు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. సముద్రాన్ని సందర్శించిన తర్వాత ఇక్కడకు వచ్చి మంచి నీటితో స్నానాలు చేసి సేద తీరే అవకాశం ఉంది. కనుక ప్రభుత్వం దీనిని మరింతగా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తుంది.

**టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు చేశాం**

ఎకోటూరిజం మరింత అభివృద్ధి చేసేందుకు అనేక ప్రతిపాదనలు చేశాం. ఇక్కడ సేద తీరే పర్యాటకులు సముద్రానికి వెళ్లేందుకు ఒక వాహనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి, గ్రీనరీ డెవలప్‌మెంట్, మినీథియేటర్ సౌకర్యంతోపాటు కాటేజీలు పెంచే ఆలోచన చేస్తున్నాం. దీనికి సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే అన్నిరకాల వసతులతో పర్యాటకులకు ఆహ్లాదకరమైన మరిన్ని కాటేజీలు అందుబాటులోకి తెస్తాం.

- ఎ.గీతిక, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డివిజన్ మేనేజర్


ఎకో టూరిజంలోని కాటేజీలు


ఆహ్లాదకరమైన వాతావరణంలో మినీ ఫంక్షన్‌గ్రౌండ్


కాటేజీల ఎదుట ఆహ్లాదకరమైన ప్రాంతం

## ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది...




ఆకాశం ఎరుపెక్కింది. గురువారం సాయంత్రం వేళ తెనాలిలో కనిపించిన దృశ్యమిది. బుర్రిపాలెం రోడ్డులో సాయంత్ర వేళ వాకింగ్‌కు వెళ్లే వారికి కనిపించిన ఈ దృశ్యం ఆకట్టుకుంది. పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలకు ఈ చిత్రం అద్దం పడుతోంది.

- తెనాలి అర్బన్ (ఆంధ్రజ్యోతి)

## ప్రాణాలతో చెలగాటం!

అది ఎప్పుడో మూసి వేసిన రైల్వే గేటు... అయినా అక్కడ నుంచి నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు... గేటుకు ఇరువైపులా గోడకట్టి రైల్వేశాఖ మూసి వేసినా దాన్ని ధ్వంసం చేసి మరీ రాకపోకలు సాగిస్తున్నారు. దీనికితోడు ఒక్కోసారి ఇక్కడ ఉన్న గూడ్స్ రైలు కింద నుంచి దూరి వెళ్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. స్థానిక బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు వద్ద నిత్యం ఇదో తంతుగా మారింది. స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు ఖాళీ లేని సమయం, సిగ్నల్ ఇవ్వని సందర్భంలో బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు పాత రైల్వేగేటు వద్ద రైళ్లు, గూడ్స్ వ్యాగన్లు నిలిచిపోతాయి. ఆ సమయంలో అవి వెళ్లేదాక ఆగకుండా వాటి కింద నుంచి దూరి వెళ్తున్నారు. అంతేకాదు సైకిళ్లను కూడా తమ వెంట తీసుకెళ్తూ కొంతమంది విద్యార్థులు రైలు పట్టాలపై ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

- గుంటూరు(ఆంధ్రజ్యోతి)


గూడ్స్‌రైలు కిందనుంచి సైకిల్‌తో సహా వెళ్తున్న విద్యార్థులు


గూడ్స్‌రైలు కింద నుంచి వెళ్తున్న యువకులు


ఆగి ఉన్న గూడ్స్ ట్యాంకర్ మధ్య నుంచి వెళ్తున్న విద్యార్థి

## ఎల్లవేళలా దయాక్షేత్రంపై ఏసయ్య కరుణ

- పాస్టర్ జాషువా మోజెస్
- లేమల్లెలో 48వ గుడారాల పండగ ప్రారంభం
- లక్షలాదిగా తరలివచ్చిన దైవజనులు, విశ్వాసులు


భక్తి గీతాలు ఆలపిస్తున్న అబ్రహం, జాన్ వెస్లీ రమేష్, ఫైడిపాల్



పండుగలో పాల్గొన్న సిస్టర్స్, విశ్వాసులు


హోసన్న గుడారాల పండుగను ప్రారంభిస్తున్న పాస్టర్ జాషువా మోజెస్, అబ్రహం, జాన్ వెస్లీ తదితరులు

అమరావతి, మార్చి 6( ఆంధ్రజ్యోతి): హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన దయాక్షేత్రంలో గురువారం సాయంత్రం 48వ గుడారాల పండగ దైవజనుల, విశ్వాసుల సమక్షంలో ప్రభువు ఆశీస్సులతో ప్రారంభమైంది. పండగను దక్షిణ ఆఫ్రికాకు చెందిన పాస్టర్ జాషువా మోజెస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా దైవ సందేశాన్ని చదివి ఏసు క్రీస్తు ఆశీస్సులు, కరుణ దయాక్షేత్రం పండగలో పాల్గొన్న దైవజనులు, విశ్వాసులపై ఉండాలని ప్రార్థించారు. ప్రారంభ కార్యక్రమంలో హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, రమేష్, ఫైడిపాల్, అనిల్, రాజుతో పాటు దైవజనులు పాల్గొని బెలూన్స్, పావురాళ్లను ఎగురవేశారు. అనంతరం దయాక్షేత్రం పుస్తకాన్ని అమెరికాకు చెందిన పాస్టర్ హెర్బిన్స్ పాల్ ఆవిష్కరించారు. దయాక్షేత్రం పాటల సీడీని మదనపల్లికి చెందిన పాస్టర్ రాజశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమాల ప్రారంభంలో హోసన్న జయమే.. జయం మనకే, ఏసయ్య నా ప్రాణమే.. అనే గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్వాసులు ఏసయ్యకు స్తోత్రాలు పలుకుతూ భక్తి సాగరంలో మునిగారు. ప్రారంభ కార్యక్రమానికి ముందు అబ్రహం మాట్లాడుతూ దయాక్షేత్రంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ దేవుని కరుణ ఉండాలని అన్నారు. పండగ జరిగే 4 రోజులు పక్కనున్న విశ్వాసుల కన్నా దేవునితో మాట్లాడుతూ ఉండాలని అన్నారు. పాస్టర్ జాషువా మోజేస్ మాట్లాడుతూ దయాక్షేత్రంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చేతులు ఆకాశం వైపు చూపిస్తున్నాయని ప్రభువు ఆశీస్సులు వారిపై ఉండాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. దేశ విదేశాల నుంచి దైవజనులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు సమీప రాష్ట్రాల నుంచి విశ్వాసులు హాజరయ్యారు. ప్రారంభం రోజునే లక్షలాది మంది ప్రార్థనలో పాల్గొన్నారు. శుక్ర, శని వారాలలో ఉదయం, సాయంత్రం, ఆదివారం మధ్యాహ్నం జరిగే ప్రార్థనలతో పండగ ముగుస్తుంది.

## మోతడకలో రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్

తాడికొండ (మోతడక) మార్చి 6(ఆంధ్రజ్యోతి): లేమల్లే గుడారాల పండగ ప్రార్థనలకు వెళ్తున్న వాహనదారులు రెండు గంటలకు పైగా ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయారు. గురువారం నుంచి పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లె గ్రామంలో నిర్వహిస్తున్న గుడారాల పండగ ప్రార్థనలకు భారీగా భక్తులు చేరుకుంటున్నారు. ఈక్రమంలో ఇతర జిల్లాల నుంచి భారీగా భక్తులు వాహనాల్లో తరలి రావటంతో తాడికొండ మండలం మోతడక గ్రామంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుడారాల పండగ ప్రార్థనలకు వెళ్లే భక్తులకు ప్రధాన రహదారి అమరావతి రోడ్డు కావటంతో భారీగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రెండు గంటలకు పైగా వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయటానికి పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనదారులే ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసుకున్నారు. తాడికొండ సీఐ వాసును వివరణ కోరగా పక్క జిల్లాల్లో జరుగుతున్న గుడారాల పండగ ప్రార్థనలకు బందోబస్తు నిర్వహించటానికి తమకు ఎలాంటి ఆదేశాలు లేవని, ట్రాఫిక్ జామ్ విషయం తెలిసి ఎస్.ఐను సిబ్బందిని పంపించామని పేర్కొన్నారు.


మోతడకలో ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

## సహకారం.. సాంకేతికం

(7వ పేజీ తరువాయి)

వీలుంటుందనేది ప్రభుత్వ ఆలోచన. మరోవైపు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా లక్షన్నర ఖాతాలు ఆన్‌లైన్ కాగా వీటికి సంబంధించి వేల ఖాతాల్లో అక్రమాలు బయటపడినట్లు సమాచారం. వీటిపై చర్యల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు.

**వాణిజ్యం.. సహకారం**

ఇప్పటి వరకు సహకార సంఘాల పాత్ర రైతులకు పంట రుణాలు అందించడంతో పాటు అరకొరగా ధాన్యం సేకరణకు మాత్రమే పరిమితమయ్యేది. అంతంతమాత్రంగా ఉన్న సొసైటీల ఆర్థిక పరిస్థితి గత ప్రభుత్వం అవలంబించిన విధానాలతో పూర్తిగా గందరగోళంలో పడిపోయింది. ఈ క్రమంలో వాటిని తిరిగి పట్టాలెక్కించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. తొలుత పీఏసీఎస్‌ల డిజిటలైజేషన్ మీద దృష్టి పెట్టిన ప్రభుత్వం మలిదశలో వాటిని వాణిజ్యం వైపు నడిపించడానికి బృహత్తర ప్రణాళికలను తయారు చేసే విధంగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని డీసీసీబీ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సొసైటీలు చేయాల్సిన వ్యాపారాలను గుర్తించడంతో పాటు ఆసక్తి ఉన్న వారికి రుణాల మంజూరు ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా పెట్రోలు బంకులు, ఎరువుల వ్యాపారం, గోడౌన్ల నిర్మాణం, విలువ ఆధారిత ఉత్పత్తులు, కల్యాణ మండపాలు, బియ్యం తదితర వ్యాపారాలను గుర్తించి ఆ దిశగా పీఏసీఎస్‌లను మళ్లించడానికి అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుంది. ఇప్పటి వరకు పంట రుణాలపై వచ్చే కమీషన్లపైనే సంఘాలు ఆధారపడేవి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా రుణాలపై నామమాత్రపు వడ్డీతో పాటు కొన్ని వ్యాపారాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా పీఏసీఎస్‌ల ఆదాయం పెరగనుంది. తద్వారా సొసైటీలకు వచ్చే ఆదాయాన్ని తిరిగి రైతుల మేలు కోసం మరింతగా ఖర్చు పెట్టాలని నిర్ణయించింది. తద్వారా సహకార రంగాన్నే బలోపేతం చేసినట్లవుతుందనేది ప్రభుత్వ ఆలోచన. ఈ చర్యలతోపాటు త్వరలోనే ఎన్నికలు జరిపి పాలకవర్గాలను కొలువదీర్చాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

## బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

చిలకలూరిపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు గురువారం కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వివిధ పార్టీల, రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో డాక్టర్ కొల్లా మాట్లాడుతూ గత సంవత్సరం పొగాకు పంట ధరలు బాగా ఉండటంతో రైతులు విస్తారంగా బర్లీ పొగాకు సాగుచేశారని, ధరలేకపోవడంతో రైతులు నిండా మునిగిపోయారన్నారు. ప్రస్తుతం బర్లీ పొగాకును సరిగా కొనటం లేదన్నారు. గత సంవత్సరం మొదటి విరుపు అడుగు ఆకు కొట్టిన తర్వాత అమ్మితే క్వింటాకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ధర లభించిందని, ఈ ఏడాది రూ.4, 5వేలకే ధర పరిమితమైందన్నారు. గత సంవత్సరం రెండో విలుపు, మూడో విలుపు పొగాకును రూ.15వేల నుంచి రూ.18వేలకు కొనుగోలు చేశారని గుర్తుచేశారు. ఈ ఏడాది రూ.10వేలకు కూడా కొనే నాధుడు కరువయ్యాడన్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వం రైతులకు అండగా నిలబడి బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌సీవీ వర్జీనియా పొగాకు ధరలను, విస్తీర్ణాన్ని పొగాకు బోర్డు నియంత్రిస్తుందని, అలాగే పొగాకు బోర్డు జోక్యం చేసుకొని బర్లీ పొగాకు పంట ధర పడిపోకుండా చూడాలని సూచించారు. కంపెనీల చేత మద్దతు ధరకు బర్లీ పొగాకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పొగాకు రైతుల తరఫున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ, రావు సుబ్రమణ్యం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, షేక్ గౌస్, రైతు సంఘం నాయకులు కోలా నవజ్యోతి, చంద్ర కొండలరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.కోటేశ్వరరావు, కారుచోల స్వప్నకుమార్, ఉప్పాలబాబు, ఆర్ నర్సిరెడ్డి, ఇంటూరి భవాని వెంకటేష్, రైతు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సాగరమాత మహోత్సవాలు

మాచర్ల రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురి సౌత్‌లో కృష్ణానది తీరాన ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం సాగరమాత ఆలయ మహోత్సవాలను ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భారతీయ సంప్రదాయాలతో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా సాగరమాత ఆలయం పేరుగాంచింది. ధూప, దీప, నైవేద్యాలు, తలనీలాలు, మొక్కుబడులు చెల్లించుకునే కార్యక్రమాలన్నీ పూర్తిగా హిందూ పద్ధతిలో జరిగే క్రైస్తవ ఆలయమిది. ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరపనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం షామియానాలు, టెంట్లు ఏర్పాటు చేశారు. అలాగే భారీ జెయింట్ వీల్స్‌తో పలు స్టాల్స్ ఏర్పాటయ్యాయి.


ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జెయింట్‌వీల్, స్టాల్స్


సాగరమాత ఆలయం

# పల్నాడు వార్తలు

నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట



## ఏఎంవో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట కల్చరల్, మార్చి, 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న అకడమిక్ మానిటరింగ్ పోస్టుకు ఫారిన్ సర్వీసుపై పనిచేసేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు ఈ పోస్టుకు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తారీఖులోపు ధ్రువీకరణ పత్రాలు, సర్వీస్ రిజిస్టర్లతో సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## కారు ఢీకొని ఆరు గొర్రెలు మృతి

రొంపిచర్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడు వద్ద అద్దంకి - నార్కెట్‌పల్లి హైవేపై గురువారం గొర్రెల మందను కారు ఢీకుంది. గ్రామానికి చెందిన సన్నెబోయిన వెంకటప్పయ్యకు చెందిన ఆరు గొర్రెలు మృతిచెందాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితుడు రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 8 నుంచి పీ4 సర్వే

వినుకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పేదరిక నిర్మూలనలో భాగంగా దిగువ స్థాయి కుటుంబాలకు చేయూత నిచ్చేందుకు ఈ నెల 8 నుంచి 25 వరకు పట్టణంలో పీ4 సర్వే నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేకు వచ్చిన సచివాలయ సిబ్బందికి ప్రజలు సహకరించి వివరాలను తెలియజేయాలని కోరారు.

## జాబ్‌మేళాలో 450 మందికి ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగిన మెగా జాబ్ మేళాలో 450మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ గురువారం తెలిపారు. గుంటూరు పేరల్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో 22 ప్రముఖ కంపెనీలు మెగా జాబ్‌మేళా నిర్వహించాయి. మెగా జాబ్ మేళాలో మొత్తం 750మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజయోత్సవం కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్ షాప్ ప్రారంభం

నరసరావుపేట రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, హ్యూమనైడ్ రోబోట్స్ అనే అంశంపై ఐదు రోజులపాటు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైపీ నారాయణ తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో ముఖ్యవక్తలుగా టీఎల్‌సీ గ్రూపు హెడ్ ఆఫ్ ఆపరేషన్ పి.సురేంద్రబాబు హాజరై విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైపీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రాక్టికల్ విషయాల్లో పునాది గట్టిగా ఉంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తు తరాల్లో హ్యూమనాయిడ్ రోబోట్స్ ప్రాతినిధ్యంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ. టి.జగదీష్, కాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి వైసీపీ నేతల పరామర్శ

వినుకొండ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వ్యవసాయ కూలీలైన దారివేముల నాగేశ్వరరావు, రత్తమ్మ దంపతుల కుమార్తె అగ్రికల్చర్ డిప్లమో విద్యార్థి మాధురి (20) అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు చుండూరి వెంకటేశ్వర్లు, నియోజకవర్గస్థాయి నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

శావల్యాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జడ్పీ పాఠశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ నిర్వహణ, విధులు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు, రైటర్ సలీం పాల్గొని విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, పరికరాలు, ఆయుధాలు, వాటిని వినియోగించే విధానం, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డికి మాజీ ఎమ్మెల్యే నివాళి

రొంపిచర్ల, మార్చి 6 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్లకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కల్లం కృష్ణారెడ్డి (93) అనారోగ్యంతో మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట చపారపు గోపాలరెడ్డి, పడాల శివారెడ్డి తదితరులు ఉన్నారు.

# రెండో పీహెచ్‌సీ నిర్మాణం ఎప్పటికో?



ఐనవోలు సమీపంలో ప్రాథమిక వైద్యశాలకు కేటాయించిన స్థలం

- నిధులు కేటాయించి, స్థలం ఉన్నా పడని ముందడుగు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ప్రజలకు అందుబాటులోకి రాని ప్రభుత్వ వైద్యం



ప్రస్తుతం వైద్యులు విధులు నిర్వహిస్తున్న చింతల చెరువు సబ్ సెంటర్

నూజెండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు నిధులు కేటాయించి స్థలం ఏర్పాటుచేసినా రెండో ప్రాథమిక వైద్యశాల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు దృష్టి సారించకపోవటం, పాలకుల అలసత్వం కారణంగా నూజెండ్ల ప్రాథమిక వైద్యశాల నుంచి మాత్రమే ప్రస్తుతం వైద్య సేవలు అందుతున్నాయి. మండలంలో 50వేలకు పైగా జనాభా ఉన్నారు. ఐనవోలు, చింతలచెరువు, మృత్యుంజాపురం, తంగిరాల తదితర గ్రామాల వారికి వైద్యశాలకు వెళ్ళేందుకు వ్యయ ప్రయాశలకోర్చి సుమారు 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. వైద్యశాలను అందుబాటులోకి తీసుకురావాలని, స్థానిక ప్రజలు, నాయకుల విజ్ఞప్తుల మేరకు నాలుగు సంవత్సరాల క్రితం ఐనవోలు, గుండ్లకమ్మ రెవెన్యూ గ్రామ పరిధిలోని గుండ్లకమ్మ రైల్వే స్టేషన్ సమీపంలోని స్థలాన్ని రెవెన్యూ శాఖకు కేటాయించగా ఆర్అండ్‌బీ అధికారులు రెండుసార్లు టెండరు పిలిచినా కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ పనులు చేసుకొని పనులు ప్రారంభించేందుకు ముందుకురాలేదు. దీంతో వైద్యశాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా రెండో ప్రాథమిక వైద్యశాలకు ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లను, ఇద్దరు సూపర్‌వైజర్లను విధుల్లోకి తీసుకున్నారు. కాగా ఇద్దరు డాక్టర్లు డ్యూటీ ప్రకారం 104కు, డ్యూటీ లేని సమయంలో చింతలచెరువు సబ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సూపర్‌వైజర్లలో ఒకరు రిటైర్ కాగా మరొకరు బదిలీపై వెళ్ళారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించాల్సిన అవసరాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు రెండో పీహెచ్‌సీ నిర్మాణం కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

### అందుబాటులో వైద్యశాల అవసరం: చింతల చెరువు మస్తాన్



ప్రజలకు అందుబాటులో వైద్యశాల ఉంటే రోగులకు ఖర్చు లేకుండా ప్రభుత్వ వైద్య సేవలు అందుతాయని చింతలచెరువు గ్రామానికి చెందిన చింతలచెరువు మస్తాన్ అన్నారు. రైతులకు, గ్రామస్థులకు పాము కాట్లు, పిచ్చి కుక్కల, కోతుల ద్వారా గాయాలైన వారికి అత్యవసర వైద్య సేవల కోసం వినుకొండ, నూజెండ్లకు వెళ్ళటం, విలువైన సమయంలో వైద్యం అందక ప్రమాద తీవ్రత పెరిగిపోతోందన్నారు. వైద్యశాల ఏర్పాటు కోసం తాము ఎంతగానో ఎదురు చూస్తున్నామన్నారు.

# ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలి

డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి



ఈపూరులో ఉపాధి పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి

ఈపూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజులు కల్పించడం జరుగుతుందని డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి అన్నారు. ఈపూరు పంచాయితీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పీడీ పరిశీలించారు. పనులకు వచ్చే కూలీలతో మాట్లాడారు. అక్కడ ఉన్న రైతులతో ఫామ్‌పాండ్ ఉపయోగాల గురించి వివరించారు. ప్రతి రైతు పొలంలో పంట కుంటలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. అందుకోసం మూడుచోట్ల స్థల పరిశీలన చేశారు. అనంతరం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీవో పుష్పరాజ్, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులకు ఎక్కువమంది కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో 1230 పంట కుంటలను తవ్వేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి కూలీకి రూ290-300లు వేతనం చెల్లించేలా పని కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలో 1247 ఎకరాలలో హార్టీకల్చరల్ మొక్కలు నాటారన్నారు. ఇప్పటివరకు సుమారు 4లక్షల 58వేలమంది కూలీలు పనిచేశారన్నారు. పనిచేసే ప్రదేశంలో కూలీలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలో 5300 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఉచితంగా ఈ శ్రమ బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

### వారంలో మినీ గోకులాల బిల్లులు చెల్లింపులు

జిల్లాలో 713 మినీ గోకులాలు మంజూరు కాగా వాటిలో 530 పూర్తి చేశారు. మరో 91 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. పూర్తిచేసిన షెడ్డులకు వారం రోజులలో బిల్లులు చెల్లింపు జరుగుతుందన్నారు. షెడ్డులు పూర్తిచేసిన రైతులు బిల్లులు కోసం ప్రతిరోజు కార్యాలయానికి వస్తున్నారని ఉపాధి హామీ పథకం కార్యాలయం సిబ్బంది పీడీకి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే ప్రభాకరరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## గంగినేని ఫౌండేషన్ సేవలు అభినందనీయం

● ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్



గంగినేని ఫౌండేషన్ అధినేత రాఘవను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పోట్లూరు (శావల్యాపురం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు గంగినేని ఫౌండేషన్ తరపున అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్ అన్నారు. గంగినేని ఫౌండేషన్ అధినేత, డీసీ చైర్మన్ గంగినేని రాఘవ ఆధ్వర్యంలో మండలంలోని పోట్లూరు జడ్పీ పాఠశాలలోని 50మంది పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్షా సామగ్రిని, స్టేషనరీలను అందజేశారు. అనంతరం రాఘవను పాఠశాల హెచ్ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, చంద్రజిత్ యాదవ్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. రాఘవ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం ప్రజలందరి కర్తవ్యమని, పేద విద్యార్థులకు సహకరించేందుకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. హెచ్ఎం అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులంతా పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని, భవిష్యత్తులో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు

## గీతాంజలిలో ఘనంగా కల్చరల్ ఫెస్ట్

వినుకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతాంజలి రెసిడెన్షియల్ స్కూల్స్, నెక్ట్స్‌జెన్ కిడ్స్‌లో కల్చరల్ ఫెస్ట్ 2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో చిన్నారులు సందడి చేశారు. గీతాంజలి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎండ్లూరి శేషగిరిరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చిన్నారులు విద్యతో పాటు పలు రంగాల్లో రాణించాలని, అప్పుడే సంపూర్ణమైనటు విద్యార్థిగా అవుతారన్నారు. చిన్నారులు ఆటపాటలతో తమపైన ఉన్న ఒత్తిడిని తొలగించుకోవాలని కోరారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.కృష్ణవేణి, కరస్పాండెంట్ వై.కిషోర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎంఏఎం ఫార్మసీలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నరసరావుపేట టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానికి కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు గురువారం తెలిపారు. ఫార్మసీ విద్యను స్థాపించడంలో ప్రొఫెసర్ మహాదేవలాల్ ష్రాఫ్ చేసిన కృషిని గుర్తించి ఆయన జన్మదినోత్సవం మార్చి 6న జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవంగా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటించిందన్నారు. ఈ శిబిరం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ బ్లడ్ సెంటర్ నరసరావుపేట ఏరియా వైద్యశాల, నేషనల్ సర్వీస్ స్కీమ్ సంయుక్తంగా నిర్వహించారని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో 40 యూనిట్ల రక్తదానం జరిగిందన్నారు. ఆర్ఎంవో డాక్టర్ కే ఏడుకొండలు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా, నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మెడికల్ ఆఫీసర్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కే రామేశ్వరి, రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ బీ నాగరాజ, జీ శ్రీనివాస్, ఎస్ వర్మ, పీ వెంకటేశ్వర్లు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బీ రవితేజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పీ4 సర్వేని పారదర్శకంగా నిర్వహించాలి

● శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు, విద్యా ప్రమాణాలు తదితర అంశాలను గుర్తించేందుకు ప్రభుత్వం పీ4 సర్వేని చేపట్టిందని, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పీ4 సర్వేని పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ4 సర్వే నిర్వహణపై సచివాలయ ఉద్యోగులకు గురువారం ఆవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ రెండో విడత పీ4 సర్వేలో భాగంగా ఈ నెల 8 నుంచి 18వరకు అన్ని గ్రామాలలో సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి ప్రజల సమాచారాన్ని నమోదు చేస్తారని, 21 నుంచి 25వరకు అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పీ4 సర్వేకి ఎంపీడీవో నోడల్ ఆఫీసర్‌గా, మండలస్థాయి అధికారులంతా సూపర్‌వైజర్‌లుగా వ్యవహరిస్తారన్నారు. ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని వారి జీవనప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తుందని, ప్రభుత్వమందించే పథకాలతో సర్వేకి సంబంధం లేదన్నారు. ఎంఈవో సాంబశివరావు, ఏపీఎం వాసుబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

చిలకలూరిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులు 86మందికి పరీక్ష సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. చిలకలూరిపేట మండలంలోని పోతవరంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కొత్త రాజాపేటలో గురుకుల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఎగ్జామ్ పాడ్స్, పెన్నులు, పుస్తకాలను ఉచితంగా అందజేశారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగారాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని పల్నాడు జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోతవరం కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ ఆశ్రుపిన్, పోతవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఏఐఎస్ఎఫ్ నాయకులు మేకపోతుల తనుష్, కంచర్ల లిఖిత్, దాసరి హేమంత్ కుమార్, మేకపోతుల మధు, షేక్ యాసిన్, డి.మణి, డి.ఈశ్వర్, ఏ మనోహర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్ బాబు


## ఎన్టీఆర్ వైద్య సేవలో నగదు రహిత వైద్యం అందాలి

● కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావుపేట లీగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పేషెంట్లకు బిల్లు లేకుండా నగదు రహిత వైద్యం అందేలా ఆసుపత్రి యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పల్నాడు జిల్లా డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ మీటింగ్ కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 77 ఫిర్యాదులను కమిటీ సభ్యులు విచారించి అక్రమంగా డబ్బులు వసూలుచేసిన ఐదు వైద్యశాలకు జరిమానా విధించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీరంగారావు, డాక్టర్ విక్టర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది పాల్గొన్నారు.

## వరి రైతుల్ని ముంచిన వైసీపీ ప్రభుత్వం

● అసెంబ్లీలో ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం వరి రైతులను నిలువునా ముంచేసి, దళారులు, వ్యాపారులను బాగుచేసిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో అన్నారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్ర రైతాంగ సమస్యలు, వారికి అందించాల్సిన సాయం గురించి ఆయన సభ దృష్టికి తెచ్చారు. వైసీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల పేరుతో వరి రైతుల్ని అన్యాయం చేసిందని, ధాన్యానికి మద్దతు ధర ప్రకటించలేదని, రైతులు పోరాటంచేసినా జగన్ ప్రభుత్వం వారిని పట్టించుకోలేదన్నారు. ఆఖరికి ధాన్యం నిల్వకు అవసరమైన గోనెసంచులు (గోతాలు) కూడా ఇవ్వలేకపోయిందన్నారు. వైసీపీప్రభుత్వం 84,724 మంది వరి రైతులకు రూ.1,674కోట్లు బకాయి పెట్టిందని, ఆ సొమ్మును కూటమిప్రభుత్వం ఈ 9నెలల్లో రైతులకు చెల్లించిందన్నారు. ధాన్యం లభ్యత ఆధారంగా కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చి, దళారుల జోక్యాన్ని, వ్యాపారుల మోసాలను కట్టడి చేసిందన్నారు. రాష్ట్ర రైతాంగానికి రాయితీపై అందించే వ్యవసాయ పరికరాలు, యంత్రాల పంపిణీపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలని పుల్లారావు కోరారు. కూటమిప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించి వరి మద్దతు ధర పెంపుతో పాటు, దేశవ్యాప్తంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలుపై కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సూచించారు.



ఆర్‌యూబీలో మురుగునీటిని తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

## ఆర్‌యూబీలో మురుగునీరు తొలగింపు

వినుకొండ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినుకొండ నుంచి నూజెండ్ల వెళ్లే రైల్వే ఆర్‌యూబీలో మురుగునీరు చేరి రాకపోకలకు ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎట్టకేలకు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ సిబ్బంది సాయంతో మురుగునీరును తొలగించేందుకు గురువారం శ్రీకారం చుట్టారు. సిబ్బంది సాయంతో నిల్వ ఉన్న మురుగునీటిని మోటారు సాయంతో తొలగించి ఊట ద్వారా వస్తున్న మురుగునీటిని మళ్లించేందుకు శాశ్వత నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.



గణపవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

## గది నిర్మిస్తే ఔట్ పోస్టు ఏర్పాటు చేస్తాం

● డీఎస్పీ నాగేశ్వరరావు

నాదెండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న బస్ షెల్టర్ పైన మరో గదిని నిర్మిస్తే పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. పత్తిపాటి పుల్లారావు ముఖద్వారం నిర్మాణ కమిటీ సభ్యుల కోరిక మేరకు ఆయన గణపవరంలోని ముఖద్వారం సెంటర్‌ను గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో ధనలక్ష్మి గ్రూపు సంస్థల సౌజన్యంతో నిర్మించిన బస్ షెల్టర్‌లో ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఆ బస్సు షెల్టర్‌ను పరిశీలించిన డీఎస్పీ దానిలో ఔట్ పోస్టు ఏర్పాటు చేయటం వల్ల ఉపయోగం ఉండదని వివరించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, కంచర్ల శ్రీను, కృష్ణారావు, ఎస్ఐ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

● జనసేన నాయకుల ధ్వజం

వినుకొండటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్‌పై గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని వినుకొండ జనసేన పార్టీ అధికార ప్రతినిధి పారెళ్ల అభిమన్యు, మండల అధ్యక్షుడు గండికోట మణికంఠ, నూజెండ్ల మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి రజబాబులు ధ్వజమెత్తారు. స్థానిక వెల్లటూరు రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను సబబు కాదన్నారు. గత ఎన్నికల్లో జగన్‌కు వచ్చిన సీట్ల కంటే ఆయన మీద నమోదైన కేసులు అధికంగా ఉన్నాయని, ముందు కేసుల గురించి చూసుకుంటే బాగుంటుందని సూచించారు. 30 సంవత్సరాలు నేను సీఎం అన్నావు, కట్ చేస్తే ప్రజలు నీకు కేవలం 11 సీట్లకు పరిమితం చేసి కనీసం ప్రతిపక్షం కూడా ఇవ్వకుండా ప్రజలు నిన్ను పక్కన బెట్టారన్నారు. 11 సీట్లుకు పడిపోయి ప్రతిపక్ష హోదా ఇవ్వమని అడుక్కునే పరిస్థితి తీసుకొచ్చావన్నారు.